

భవనం కూల్చివేసి వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు

శిథిల భవనం కూల్చివేత

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న శిథిల భవనాన్ని కూల్చివేశారు. ఇరవై సంవత్సరాలుగా వృథాగా ఉన్న భవనాన్ని మూడు రోజులుగా కూల్చివేస్తున్నారు. శనివారానికి మొత్తం భవనం కూల్చివేశారు. శిథిలాలు కూడా తొలగించే పనులు మొదలుపెట్టారు.

మధురంగా అన్నమయ్య గీతాలాపన



చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లికి చెందిన ప్రముఖ గాయని మాళవిక ఆనంద్ నిర్వహించిన అన్నమయ్య గీతాలాపన మధురంగా సాగింది. జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన అన్నమయ్య కీర్తనల గానగోష్టి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ధర్నాకు తరలిన బీఆర్ఎస్ నేతలు

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కవిత అరెస్ట్ అక్రమమని గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేష్ ఆరోపించారు. కవితను అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం రామ్‌నగర్ చౌరస్తాలో జరిగిన పార్టీ ధర్నాకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు రాకేష్, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ముఠా నరేష్, నవీన్‌యాదవ్, బత్తుల కిరణ్, గడ్డమీది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికే కవిత అరెస్ట్

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరిరవిప్రసాద్ తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీజేపీ తమ రాజకీయ లబ్ధి కోసమే చేశారని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందు కవితను అరెస్ట్ చేశారంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బతీయాలనే కుటిలయత్నంతోనే బీజేపీ కుట్రలు పన్ని కవితను అరెస్ట్ చేశారన్నారు. ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మాత్రమే కాకుండా దేశప్రజలు అందరూ బీజేపీని చెంప చెల్లుమనిపిస్తారని రాహుల్ గాంధీని ప్రధాని చేయడం ఖాయమన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కవాడిగూడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): లడాక్, హిమాలయాల ప్రదేశాల్లో 370 ఆర్టికల్ రద్దయిన తరువాత అక్కడి ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా మైనింగ్‌లకు అనుమతులు ఇస్తూ పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నారని టీమ్ ఫర్‌ది నీడి, ధ్రువాన్ష్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ శనివారం ఇందిరాపార్కు వద్ద ఆయా సంస్థల ప్రతినిధులు దీక్ష చేపట్టారు. సంస్థ ప్రతినిధులు వినయ్‌వంగాల, మధులత, శ్రీనివాస్, రాకేష్, కృష్ణవంశీ, తేజ మాట్లాడుతూ లడాక్, అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం వంటి గిరిజన జనాభా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక హోదా కల్పిస్తామని ఇచ్చిన హామీలను నేరవేర్చాలని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి లడాక్, హిమాలయ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు అభిషేక్ కెన్నడి, గుర్రం శంకర్

నోట్ పుస్తకాల పంపిణీ

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో పదేళ్ల కాంగ్రెస్‌దే అధికారం ఉంటుందని ఆ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతున్న సందర్భంగా శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, శీలం సత్యనారాయణ, కెన్నడి రాజు, జయేందర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం



రవికుమార్

అంబర్‌పేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ రంగంలో విశేష సేవలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి చేగోని రవికుమార్‌కు తెలుగు యూనివర్సిటీ 2022 కీర్తి పురస్కారం లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతియేటా విశేషమైన కృషి చేసిన ప్రముఖులకు కీర్తి పురస్కారం ప్రదానం చేస్తుంది. చేగోని రవికుమార్ రెండు దశాబ్దాలుగా గ్రంథాలయ రంగంలో పరిశోధన, అభివృద్ధి తదితర అంశాలలో విశేషమైన కృషి చేస్తున్నారు. రవికుమార్‌ను కీర్తి పురస్కారానిక ఎంపిక చేయడం పై పలువురు గ్రంథ పాలకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 21న నాంపల్లి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో పురస్కార ప్రదానం ఉంటుందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.



సాయిమధురనగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

నల్లకుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సాయిమధురనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను శనివారం కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జమ్మిచెట్టి బాలరాజు, మిరియాల శ్రీనివాస్, న్యాయవాది శ్రీహరి, మహేందర్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే కవిత అరెస్ట్

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఎమ్మెల్సీ కవితను ప్రధాని మోదీ ఈడీ ముసుగులో అరెస్ట్ చేయించారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికే ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక రోజు ముందు కవిత అరెస్ట్‌కు కుట్ర చేశారని విమర్శించారు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాంనగర్ చౌరస్తాలో ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు ఎలాంటి సంబంధం లేకున్నా ప్రధాని మోదీ, అమిత్‌షాలు బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలనే కుట్ర చేసి కవితను ఈడీ ద్వారా అరెస్ట్ చేయించారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ మెజారిటీ స్థానాలు గెలిచి బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, వివిధ డివిజన్ల అధ్యక్షులు ఎం.రాకేష్, కె.శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ జాగృతి నేతలకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, నాయకులు



అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా వద్ద ధర్నాలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, తదితరులు

అంబర్‌పేటలో...

అంబర్‌పేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలీకేఫ్ చౌరస్తాలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగా బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేసిందని విమర్శించారు. కేసు విచారణలో ఉన్నందున అరెస్ట్ చేయబోమని చెప్పి కవితను అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందని, ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బి.పద్మ, దూసరి లావణ్య, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి, నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట అభివృద్ధికి రూ.15 కోట్లు

● డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి దశలవారీగా నిధులను మంజూరు చేయిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాగ్‌అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట డివిజన్లలోని రోడ్లు, డ్రైనేజీ పైప్ లైన్‌ల ఆధునీకీకరణ కోసం రూ.15 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను లబ్ధిదారులకు అందే విధంగా నాయకులు తమవంతు కృషి చేయాలని ఆయన సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠపరచి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు గరిగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునీకరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలపారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని దేవి ప్రసాద్‌బాగ్, జ్యోతినగర్ బస్తీలలో రూ.48 లక్షలతో, గంగానగర్‌లో రూ.7 లక్షల 44 వేల నిధులతో సివరేజీ పైప్‌లైన్ పనులకు, బండమైస్మనగర్ రూ. 10.2 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ రచన శ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని డివిజన్‌లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నా వెంటనే తనకు సమాచారం ఇస్తే ఆయా శాఖ అధికారులను అప్రమత్తం చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠాజైసింహా, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎ ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ఆర్ రాంచందర్, రాజశేఖర్‌గౌడ్, శ్రీకాంత్, రమణ, శ్రీహరి, బీజేపీ నేతలు కుమార్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్, చంద్రశేఖర్, పరుశురాం, దిలీప్‌యాదవ్, అనిల్, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్ రెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్‌తోపాటు నాయకులు కార్యకర్తలు బస్తీ వాసులు పాల్గొన్నారు.

ప్రధాని ఫసల్ యోజన పథకంతో రైతులకు ప్రయోజనం

● ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రవేశపెట్టిన పథకాలతో అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలు చేకూరుతున్నాయని, ప్రధాని ఫసల్ యోజన పథకం ద్వారా కోట్లాది మంది రైతులకు ప్రయోజనం పొందుతున్నారని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ప్రధాని ఫసల్ యోజన లబ్ధిదారురాలు నైషదం ఉమామహేశ్వరి కుటుంబాన్ని ఆయన కలిశారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వ హయంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ మోదీ పదేళ్ల పాలనలో ప్రపంచంలో ఆర్థికంగా అభినందించిన దేశాలలో మన దేశం ఎదిగిందన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీకి ఓటు వేసి మరోసారి మోదీని ప్రధాన మంత్రిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవి చారి, నాయకులు ఎస్.ఎస్.మూర్తి, రమేష్‌రామ్, జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్, ఉపేందర్, నవీన్, విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలిని కలిసి మోదీ పథకాలను వివరిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, తదితరులు

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అనేకమందికి లబ్ధి చేకూరిందని ఎంపీ డా.కె. లక్ష్మణ్ అన్నారు. లాబర్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం గాంధీనగర్ డివిజన్‌లోని కేంద్రప్రభుత్వ పథకాల లబ్ధి దారులను డా.లక్ష్మణ్ కలిసి వారితో మాట్లాడి వారి వృత్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్, ముషీరాబాద్ ప్రభారి వి. అశోక్, రమేష్‌రామ్, జి. శ్రీకాంత్, నవీన్‌కుమార్, సత్తిరెడ్డి, సాయికుమార్, లక్ష్మణ్ యాదవ్, డి.సత్యం, సంతోష్, లక్ష్మీనారాయణ, శివకుమార్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం నేతలు

ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్‌కు 500 కోట్లు కేటాయించాలి: యాదగిరి

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్‌కు 500 కోట్ల నిధులు కేటాయించి పాలక మండలిని ఏర్పాటు చేయాలని ఎరుకల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ ఏకలవ్య ఏరుకల సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, కో-చైర్మన్‌లు కూరకుల. కృష్ణ, ధనసరి కృష్ణ, మల్లికార్జున్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఏరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో ఏరులకు అవకాశం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. కార్యక్రమంలో ఏరుకల సంఘం నాయకులు మల్లికార్జున్, శివకుమార్, సాయికిరణ్‌లు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, సీఐలు నిరంజన్, సీతయ్య

టీ కొట్టు యజమానిని హత్య చేసిన నిందితుడి రిమాండ్

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో టీ కొట్టు యజమానిని కత్తితో పొడిచి హత్య చేసిన నిందితుడిని ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భోలక్‌పూర్‌లో టీ కొట్టు నిర్వహిస్తున్న మహ్మద్‌గౌస్ (45) హత్య చేసిన ఫాయజ్ ఆహ్మద్ (42)లు ఇద్దరు ఒకే ఇంట్లో అద్దెకు ఉండేవారని, ఇద్దరి మధ్య రెండున్నర సంవత్సరాలుగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో ఇద్దరి మధ్య పలుమార్లు స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకున్నారు. 12వ తేదీన ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఫా యజ్ ఆహ్మద్ మహ్మద్‌గౌస్ నుంచి ప్రాణహానీ ఉందని అతన్నే చంపివేయాలని నిర్ణయించుకుని ఈ నెల 12న మధ్యాహ్నం కత్తితో పొడిచి హత్య చేశాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫాయజ్ ఆహ్మద్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల్లో మాజీ సైనికులకు న్యాయం చేయాలి

● తెలంగాణ మాజీ సైనికులు

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల్లో మాజీ సైనికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మాజీ సైనికులు సురేందర్‌రెడ్డి, రవికుమార్, సీహెచ్ సురేష్‌కుమార్, ఆర్ మల్లారెడ్డి, ఆంజనేయులు, నరేందర్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 55 బాధితులతో ప్రభుత్వం చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ మాజీ సైనికులు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల్లో మాజీ సైనికులకు సరైన న్యాయం చేయాలంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఉద్యోగాల్లో అవకాశం కల్పించకుండా అన్యాయం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ గ్రూప్ సి, డి రెండు శాతం పోస్టులతో ఎస్సీ ఎస్టీ పిహెచ్‌సీలతో సమానంగా మాజీ సైనికులకు 30 శాతం క్వాలిపై మార్కులు ఉండేవని, పోలీసు నియామకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అన్ని ఉద్యోగాలలో ఎస్సీ ఎస్టీ పీహెచ్‌సీలతో సమానంగా 30 శాతం మార్కులకే ఉద్యోగ అర్హత ఉండేది కాని నీళ్లు, నిధులు, నియామకాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2002 సంవత్సరంలో జీవో నెంబర్ 55 ద్వారా ఓసీ, ఈడబ్ల్యుసి, స్పోర్ట్స్‌మెన్‌తోపాటు మాజీ సైనికులకు 30 శాతం ఉన్న మార్కులను 40 శాతానికి పెంచి మాజీ సైనికుల ఉద్యోగాలకు అర్హత పొందకుండా అన్యాయం చేసిందని మండిపడ్డారు. క్వాలిపై మార్కులను 40 శాతం నుంచి 30 శాతానికి తగ్గించాలని కోరుతూ డైరెక్టర్ రీజనల్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్, హైకోర్టును ఆశ్రయిస్తే మాజీ సైనికుల ఉద్యోగాల విషయంపై టీఎస్‌పీఎస్సీ తగిన నిర్ణయం తీసుకోని ఫలితాలు విడుదల చేయాలని తీర్పుచెప్పినా ఇప్పటికీ ఆ తీర్పు అమలు కాలేదన్నారు. ఈ అన్యాయం గ్రూప్ ఉద్యోగాల్లో మాత్రమే కాకుండా గ్రూప్ 3 పోస్టులలో కూడ ఇదే రకమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మాజీ సైనికులు సంజీవ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

31 లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ

● డీఎంసీ ఖాదర్ మొహినుద్దీన్

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సర్కిల్ 15 పరిధిలోని ఇంటి యజమానులు ఈ నెల 31వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించి 90 శాతం వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని డీఎంసీ ఖాదర్ మొహినుద్దీన్ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముషీరాబాద్ సర్కిల్ 15 పై కమిషనర్ ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఇప్పటి వరకు 60 శాతం ఆస్తి పన్ను వసూలు చేయడం జరిగిందన్నారు. సర్కిల్‌కు 40 కోట్ల టార్గెట్ ఉండగా 32 కోట్లు వసూలు చేయడం జరిగిందని, ఈ నెల 31వ తేదీలోపు 8 కోట్లను వసూలు చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నులో విధించిన వడ్డీలో 90 శాతం ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఆస్తి పన్నుకు సంబంధించి కోర్టులో ఉన్న వివాదాలను పరిష్కారం వేదికలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించని ఆస్తిని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా శ్రీ రాఘవేంద్రస్వామి జయంతి

బర్కత్‌పుర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురలోని శ్రీరామవేంద్రస్వామి జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. నగర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. 108 లీటర్ల ఆవు పాలతో శ్రీరాఘవేంద్రస్వామికి పాలాభిషేకం నిర్వహించారు. పలపంచామృతాభిషేకం నిర్వహించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ కె.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



శ్రీరాఘవేంద్రస్వామి జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు

పత్తి అనిల్‌కు కేంద్ర మంత్రి నివాళి

అంబర్‌పేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ బీజేపీ నాయకుడు పత్తి అనిల్ శుక్రవారం మృతి చెందారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం పత్తి అనిల్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. దివంగత పత్తి అనిల్ బీజేపీకి చేసిన సేవలను కిషన్‌రెడ్డి కొనియాడారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, నాయకులు నాగభూషణం చారి, భిక్షపతి, యశ్వంత్, ఆర్.కృష్ణ ముదిరాజ్‌లు పత్తి అనిల్ మృతదేహానికి నివాళులర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ సినీ దర్శకుడు నర్సింగ్‌రావు

డప్పు రమేష్ సేవలు మరువలేం

● ప్రముఖ సినీ దర్శకుడు నర్సింగ్‌రావు

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తన ఆట, పాట, డప్పు కళ ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడంలో డప్పు రమేష్ చేసిన కృషి మరువలేనిదని ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జన నాట్య మండలి రమేష్ మిత్రుల ఆధ్వర్యంలో డప్పు రమేష్ ద్వితీయ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా బి.నర్సింగ్‌రావు డప్పు రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాజ్యం పెట్టే హింసలను, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారుడు రమేష్ అని అన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ సి.కాసీం, నాయకులు జి.అనురాధ, జె.ఎన్.ఎం.రమేష్ మిత్రులు భూపాల్, మాభూమి సంధ్య, రాజ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ నేమూరి సాంబశివగౌడ్

సేవాభావంతో ముందుకు సాగినప్పుడే గుర్తింపు

● మాజీ కార్పొరేటర్ నేమూరి సాంబశివగౌడ్

బర్కత్‌పుర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సేవాభావంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని మాజీ కార్పొరేటర్ నేమూరి సాంబశివగౌడ్ అన్నారు. సంఘసేవకురాలు నేమూరి లక్ష్మమ్మ రెండ వర్ధంతి సందర్భంగా డీడీ కాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవకు అంకితం చేసిన నేమూరి లక్ష్మమ్మ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని కొనియాడారు. మాతృ భూమిని, మాతృమూర్తిని ప్రతి ఒక్కరు గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో నేమూరి చంద్రకళ, నేమూరి అవినాష్‌గౌడ్, నేమూరి స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వంగపల్లి శ్రీనివాస్, తదితరులు

కవిత అరెస్టుకు నిరసనగా ధర్నా

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టీఎస్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాస్తారోకో చేయడానికి టీఎస్ ఎమ్మార్పీఎస్ నేతలు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆందోళన కారులకు వాగ్వాదం తోపులాట జరగడంతో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వంగపల్లి శ్రీనివాస్‌తో పాటు ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ యువసేన రాష్ట్ర అధ్యక్షుడె రమేష్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అద్దె బకాయిలు విడుదల చేయాలి

● రెంటెడ్ బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జంటనగరాలలో 116 ప్రభుత్వ పాఠశాలలు సొంత భవనాలు లేక అద్దె భవనాలలో నడుస్తున్నాయని రెంటెడ్ బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ భవనాల అద్దె బకాయిలను మూడేళ్లుగా గత ప్రభుత్వం విడుదల చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెంటెడ్ బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అతిఖ్, కార్యదర్శి జహంగీర్ ఆలీలు మాట్లాడారు. మూడేళ్లుగా అద్దె బకాయిలు నాలుగు కోట్ల రూపాయలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అద్దె బకాయిలు విడుదల చేయకపోతే తాము ప్రాపర్టీ ట్యాక్స్, విద్యుత్ బిల్లులను ఎలా చెల్లిస్తామని వారన్నారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు హఫీజ్‌ఖాన్, మహ్మద్ వహీదుద్దీన్, మహ్మద్ అమీర్, మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ముషీరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ కిషాన్‌సెల్ జాతీయ వైస్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రాజపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన అల్పాహార పంపిణీ కార్యక్రమానికి కోదండరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి ప్యాడ్‌ల పంపిణీ

ముషీరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని పటాన్‌బస్తీలో పాఠశాల విద్యార్థులకు శనివారం చాంద్‌సాబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్‌పర్వేజ్ మాట్లాడుతూ... పేద విద్యార్థులకు పరీక్షా సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రస్ట్ ఆధ్వర్యంలో తమ వంతు సాయం అందిస్తున్నామని తెలిపారు.